## మేరు కులస్తులకు చట్టసభల్లో అవకాశం కల్పించాలి


సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మేరు కులస్తులకు చట్టసభల్లో అవకాశం కల్పించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మేరు యువజన సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో మేరు కులస్తులు అండగా ఉండి పార్టీ గెలుపునకు కృషి చేశారన్నారు. న్యూ ఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి మేరు కులస్తులకు చట్ట సభల్లో అవకాశం కల్పించాలని మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..పార్లమెంటు ఎన్నికల్లో కూడా తెలంగాణ రాష్ట్ర నలుమూలలా మేరు కులస్తులంతా కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. రాజ్యసభలో, విధాన సభలో ఎంపీలు, ఎమ్మెల్సీ పదవులు అప్పగించి కార్పొరేషన్ పదవులు ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలం శంకర్, పోల్కం వినయ్‌రాజ్, దశరథ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘానికి అండగా ఉంటాం


ఆత్మీయ సమావేశానికి హాజరైన మారం జగదీష్

నాంపల్లి: తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘానికి టీఎన్జీఓ సంఘం అండగా ఉంటుందని టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్ అన్నారు. సోమవారం నాంపల్లిలోని గృహకల్ప భవన సముదాయంలో ఇటీవల నూతనంగా కొలువుదీరిన తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఆత్మీయ సమావేశం జరిగింది. సంఘం ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా మారం జగదీష్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ..ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగులను వెనక్కి రప్పించేందుకు శాయాశక్తుల కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ మాట్లాడుతూ.. సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. వరుసగా ఆరు పర్యాయాలు సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికైన గడ్డం జ్ఞానేశ్వర్‌ను ఈ సందర్భంగా అభినందించారు. ఆయన పుట్టిన రోజున ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని కేక్ కట్ చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ కేంద్ర సంఘం సహాధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, నగర శాఖ అధ్యక్షులు శ్రీకాంత్, టీజీఓ సహాధ్యక్షులు బి.శ్యామ్, తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం నేతలు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రక్షాళనపై దృష్టి పెడదాం


మొక్కను అందిస్తున్న భానుప్రకాష్

లంగర్‌హౌస్: అక్రమ ఓటర్లతో పాటు ఓటు హక్కు కోల్పోయిన వారి జాబితాపై మొదలు ప్రధాన దృష్టి పెడదామని బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిని మాధవీలత అన్నారు. లంగర్‌హౌస్‌కు చెందిన భానుప్రకాష్‌ను ఖమ్మం జిల్లా కో ఆర్డినేటర్‌గా నియమించగా ఆయన ఆధ్వర్యంలో మాధవీలతను కలిశారు. ఈ సందర్భంగా గతంలో ఎన్నికల వేళ ఎదుర్కొన్న సమస్యలను ఆమెకు వివరించారు. మాధవీలత మాట్లాడుతూ..ఓటరు జాబితా సవరణ కోసం అవసరమైతే నేరుగా ఢిల్లీకి వెళ్లి కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరింపజేస్తామన్నారు. ఈ సమావేశంలో హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, సుగంధ పుష్ప, వినేష్‌సింగ్, నాగేంద్ర ప్రకాష్ రెడ్డి ఉన్నారు.

## సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి


తన కార్యాలయానికి వచ్చిన వారికి సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే

గోల్కొండ: అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన తన వద్దకు వచ్చిన వారితో మాట్లాడి వారి అభ్యర్థనలను విన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సహాయం కోసం సీఎంఆర్ఎఫ్ పథకానికి అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకుంటే వెంటనే తాను ఆర్థిక సహాయం ఇప్పిస్తానన్నారు. స్వయం ఉపాధి, మహిళా పొదుపు సంఘాలు, తదితర వాటికి దరఖాస్తు చేసుకునే వారికి సైతం అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడమే కాకుండా వారికి తన ఆఫీస్ లెటర్‌పై సంబంధిత అధికారులకు అభ్యర్థన పత్రాన్ని కూడా ఇస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు ఆలీముద్దీన్, అబ్బాస్ హుస్సేన్ తదితరులున్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే ఎరుకలకు న్యాయం


భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ఎరుక కులస్తులకు న్యాయం జరుగుతుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ఎరుకల సంఘం వారు సోమవారం కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఎరుకల నాంచారమ్మ జాతర వేడుకలను ప్రభుత్వ పరంగా నిర్వహించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎరుక కులస్తులు స్వతహాగా కష్టజీవులన్నారు. వారి డిమాండ్లు న్యాయమైనవేనని ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డికి కూడా తెలుసు అని ఆయన పేర్కొన్నారు. ఆయనను కలిసిన వారిలో ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురాకుల కృష్ణ, సుల్తాన్ యాదగిరి, బుడ్డ సత్యనారాయణ, మల్లికార్జున్, పూతడి మల్లేష్, తేగల కృష్ణయ్య, భువనగిరి జిల్లా కాంగ్రెస్ నాయకుడు రాఘవరెడ్డి తదితరులున్నారు.

## 13న 'మా భగవతి విశాల్ జాగరణ్'


కార్యాలయాన్ని ప్రారంభించిన మా భగవతి విశాల్ జాగరణ్ ప్రతినిధులు

జియాగూడ: రహింపురా అంబేడ్కర్ భవన్‌లో ఉగాది పండుగను పురస్కరించుకుని ఈనెల 13న 27వ మా భగవతి విశాల్ జాగరణ్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు ఈరాలాల్, సలహాదారులు మోహన్‌లాల్ చిట్టివాలే, అశోక్ సింగ్, ప్రధాన కార్యదర్శి మఖేష్ సింగ్ తెలిపారు. సోమవారం రహింపురాలో సమితి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ..13న రాత్రి 8 గంటలకు మా భగవతి విశాల్ జాగరణను పురస్కరించుకుని పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. భజన కార్యక్రమాన్ని శ్రీరామ్‌దేవ్ భక్త సంఘం భాగ్యనగర్ ప్రముఖ గాయకులు సుశీల్‌గోపాల్ బజాజ్, ఠాకూర్ రవి సింగ్, ఎస్.రాజన్‌కుమార్, అనూప్‌కుమార్ భజనలు నిర్వహిస్తారన్నారు. అలాగే మా భగవతి అలౌకి శృంగార్, జగ్‌మగ్ రోషిణి, మాతాకా ఖజానా, చప్పన్‌బోగ్, తారా రాణి కథ, అఖండ జ్యోతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సుధీర్ సింగ్, ఠాకూర్ విపిన్ రాజ్ సింగ్, సచిన్‌రాజ్ సింగ్, రామ్ సింగ్, ధన్‌రాజ్ సింగ్, కిషన్ సింగ్, గోపాల్ సింగ్, మోహన్ సింగ్, బలరామ్‌సింగ్, పవన్‌సింగ్, కిశోర్ కుమార్, మహేష్, ముఖేష్ పాల్గొన్నారు.

## రంజాన్ ప్రత్యేకం షీర్ ఖుర్మా..

**మార్కెట్లో సిద్ధంగా ఉన్న షీర్ ఖుర్మా తయారీ సామగ్రి**



చార్మినార్: రంజాన్ మాసంలో షీర్ ఖుర్మాకు ఎంతో ప్రాధాన్యత ఉంది. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా ముస్లింలు రంజాన్ మాసంలో ప్రతిరోజూ షీర్ ఖుర్మాను తయారు చేస్తారు. ముఖ్యంగా పండుగ రోజు ఈ షీర్ ఖుర్మాకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. పండుగ రోజు తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో పాటు హిందువులకు సైతం అందజేసి వారి పట్ల తమకున్న ప్రేమను చాటుకుంటారు. పండుగ రోజు సామూహిక ప్రార్థనలు ముగిసిన అనంతరం బంధు మిత్రులకు 'షీర్ ఖుర్మా'(పాయసం)ను అందజేసి రంజాన్ ఈద్ ముబారక్ తెలియజేయడం ఆనవాయితీ. మహ్మద్ ప్రవక్త సలుల్లాహి అలైహి వసల్లం ఖర్జూరంతో రంజాన్ ఉపవాస దీక్షలను విరమించి మిఠాయి (షీర్ ఖుర్మా) తినడంతో ఈ వంటకం సున్నత్‌గా మారింది. దీంతో పాతబస్తీలోని ఏ వీధిలో చూసినా షీర్ ఖుర్మా దుకాణాలు వినియోగదారుల రద్దీతో కళకళలాడుతున్నాయి. షీర్ ఖుర్మా తయారు చేయడానికి అవసరమైన సేమియా, బాదం, పిస్తా, కిస్మిస్, చిరంజీవి, ఖాజు, తర్బూజ గింజలతో పాటు పాల పౌడర్ ప్యాకెట్లు సైతం మార్కెట్లో సిద్ధంగా ఉన్నాయి.

# సందడిగా రంజాన్ మార్కెట్

- టోలిచౌకీ-హకీంపేట్ మార్కెట్‌లో రెడిమేడ్ దుస్తులు ఫ్యాన్సీ ఐటమ్స్‌లకు భలే గిరాకీ
- మరో లాడ్ బజార్‌గా ప్రసిద్ధి
- రోజూ లక్షల్లో అమ్మకాలు



టోలిచౌకీ లేడీస్ స్పెషల్ మార్కెట్



గోల్కొండ: రంజాన్ మాసం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైనా టోలిచౌకీ-హకీంపేట్ రంజాన్ మార్కెట్ కిటకిటలాడుతుంది. ప్రతియేటా రంజాన్ కోసం ఇక్కడ వివిధ రకాల వస్తువుల స్టాల్స్ వెలుస్తాయి. కోల్‌కత్త, ఉత్తర్‌ప్రదేశ్, కశ్మీర్, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి వివిధ రకాల వ్యాపారులు తమ తమ వస్తువులను తీసుకొచ్చి ఇక్కడ అమ్ముతారు. టోలిచౌకీ-హకీంపేట్ రోడ్డులో ఎప్పుడూ ఉండే షాపుల వారు రంజాన్ కోసం తమ షాపుల సామాన్లను ఖాళీ చేసి రంజాన్ మాసం కోసం వీటిని ప్రత్యేక స్టాళ్లుగా ఏర్పాటు చేస్తారు. పలువురు కిరాణా షాప్స్, జనరల్ స్టోర్స్‌ల వారు తాత్కాలికంగా షాపులను నెల కోసం అద్దెలకు ఇచ్చుకుంటారు. ప్రతి నిత్యం లక్షల్లో వ్యాపారం జరిగే రంజాన్ బజార్‌కు టోలిచౌకీ సమీప ప్రాంతాల నుంచి ముస్లింలు పెద్ద ఎత్తున తరలివస్తారు. పాత నగరంలోని లాడ్ బజార్‌లో లభించే వస్తువులన్నీ ఒకేచోట ఇక్కడ లభిస్తాయి. గోల్కొండ, లంగర్‌హౌస్, షేక్‌పేట్, మణికొండ, నార్సింగి, గచ్చిబౌలి, రాయదుర్గం తదితర ప్రాంతాల వారు లాడ్ బజార్ పోవడం ఎందుకు అని టోలిచౌకీ రంజాన్ మార్కెట్‌కే వస్తుంటారు.

**సాయంత్రం కాగానే..**

సాయంత్రం కాగానే టోలిచౌకీ రోడ్లన్నీ కొనుగోలు దారులతో కిటకిటలాడుతుంటాయి. చిన్న పిల్లల దుస్తులు, పాదరక్షల నుంచి అన్ని వయస్సుల వారు మెచ్చే డిజైన్‌లలో రెడిమెడ్ దుస్తులు, డ్రెస్ మెటీరియల్స్ ఇక్కడ లభిస్తాయి. అయితే నగరంలోని ఇతర మార్కెట్‌ల కంటే ఇక్కడ లభించే వస్తువుల ధరలు బాగా తక్కువగా ఉంటాయి. అయితే నాణ్యత మాత్రం లాడ్ బజార్ మార్కెట్‌కు ఏ మాత్రం తీసిపోకుండా ఉంటుంది.

**ప్రత్యేక స్టాల్స్..**

- బుర్కాల కోసం ఇక్కడ ప్రత్యేక స్టాల్స్ లెక్కకు మించి ఉన్నాయి. యువతులతో పాటు పెద్ద వయస్సు మహిళలు మెచ్చే డిజైన్ల బుర్కాలు ఇక్కడ ప్రత్యేకంగా లభిస్తాయి. కోల్‌కత్త, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వ్యాపారులు బుర్కాలను ఇక్కడకు తెచ్చి అముతున్నారు. ఒక్కో బుర్కా రూ.350–600 వరకు లభిస్తున్నాయి.
- కశ్మీరి శాలువాలు అమ్మే స్టాల్స్ కూడా ప్రత్యేకంగా ఏర్పాటయ్యాయి. కశ్మీరి వ్యాపారులు సరసమైన ధరలకే వివిధ సైజుల శాలువాలను ఇక్కడికి తెచ్చి అమ్ముతున్నారు. మొదటి రకం శాలువా ఒకటి రూ.1500 నుంచి 2000, రెండవ రకం శాలువ రూ.300–600 వరకు అమ్ముతున్నారు.
- ఆర్టిఫిషియల్ జువెల్లరీ షాపులు కూడా కొనుగోళ్లతో కిటకిటలాడుతున్నాయి. చెన్నైతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి స్థానిక వ్యాపారులు వేలి ఉంగరాలతో పాటు ఇతర ఆర్టిఫిషియల్ ఆభరణాలను ఇక్కడ అమ్ముతున్నారు.
- రెడిమేడ్ దుస్తులల్లో పురుషుల కోసం ప్రత్యేకంగా షాపులు వెలిశాయి. ఖుర్తా పైజామా, పటానీ సూట్, షేర్వానీ, సద్రీ లాంటివి వివిధ డిజైన్‌లు ధరలలో లభిస్తున్నాయి.

ఇవే కాకుండా జీన్స్, క్యాజువల్ ప్యాంట్, షర్ట్ కూడా అతి తక్కువ ధరలకే నాణ్యమైనవి ఇక్కడ లభ్యమవుతున్నాయి.

- లేడీస్ స్పెషల్ స్టాల్స్‌లో యువతులు ఎక్కువగా మెచ్చే ఖుర్తీలు, అధునాతన డిజైన్‌లలో విరివిగా లభిస్తున్నాయి. చీరలతో పాటు సూట్స్, లెగిన్స్ సైతం తక్కువ ధరలకే లభిస్తున్నాయి.
- ఫుట్ వేర్ స్టాల్స్ కూడా ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. చిన్న పిల్లల షూజ్, సాండిల్స్‌తో పాటు మహిళల షూజ్, హైహీల్స్‌లను మహిళలు ఎక్కువగా కొంటున్నారు.
- వీటితో పాటు ఇక్కడ రంజాన్ పండుగ కోసం సేమియా, డ్రై ఫ్రూట్స్ స్టాల్స్ ప్రత్యేకంగా ఏర్పాటయ్యాయి. కశ్మీరి వ్యాపారులు డ్రై ఫ్రూట్స్‌ను ప్రత్యేకంగా తెచ్చి అమ్ముతున్నారు. ఇక్కడ డ్రై ఫ్రూట్స్ బేగంబజార్ హోల్‌సెల్ ధరలకే లభిస్తున్నాయి.
- టోలిచౌకీ చౌరస్తా వద్ద అత్తర్‌లు, టోపీలు కూడా బాగా అమ్ముడవుతున్నాయి.

## 5న ప్రత్యేక 'ఖీరత్'


మౌలానా సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ

గోల్కొండ: ఈ నెల 5న రంజాన్ చివరి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక ఖీరత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ఖారీ సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ అన్నారు. ఈ నెల 5న మధ్యాహ్నం ఒంటి గంటకు గోల్కొండ రిసాలబజార్, దిలావర్‌షా నగర్‌లోని అక్తరీ మసీదులో ఈ కార్యక్రమం ఉంటుందని ఆయన అన్నారు. రంజాన్ మాసం ప్రత్యేకతలు, రంజాన్ మాసపు శుక్రవారాలు ముఖ్యంగా రంజాన్ చివరి శుక్రవారం ప్రత్యేకతల గురించి ఈ కార్యక్రమంలో ఖారీలు వివరిస్తారని ఆయన అన్నారు. ఇరాన్ దేశానికి చెందిన ఖారీ మహ్మద్ జవాద్ ఖషాఫీ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

## ప్రైవేట్ టీచర్స్‌కు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నాంపల్లి: ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించే విధంగా కేంద్రంలో చట్టం తీసుకురావాలని, రేపు జరుగబోయే సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోలలో రెండు జాతీయ పార్టీలు ప్రకటించాలని ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బడే సాబ్ డిమాండ్ చేశారు. సోమవారం నాంపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. లేబర్ కన్నా అధ్వానంగా ప్రైవేట్ టీచర్స్ బతుకులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ చనిపోతే లేబర్ యాక్టు ద్వారా కొత్త నష్ట పరిహారం వస్తుందని..లేబర్ కమిషనర్ వారికి మేలు చేస్తారని అభిప్రాయం వ్యక్తం చేశారు. అదే ప్రైవేట్ ఉపాధ్యాయుడు చనిపోతే ఎలాంటి నష్టపరిహారం, ఇన్సూరెన్స్ రాదని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రైవేట్ టీచర్ల కోసం కేంద్రంలో ప్రత్యేక చట్టం తీసుకురావాలని, వారికి ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## గో సేవలో బీజేపీ నాయకులు



గోల్కొండ: గోమాత సేవకు మించిన సేవ మరేది లేదని గుడిమల్కాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జి.సునీల్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆయన గుడిమల్కాపూర్‌లోని గోశాలలో గోవులకు సేవ చేశారు. ఈ సందర్భంగా ఆయన గోశాలను శుభ్రం చేసి గోవులకు మేత వేశారు.

## పైప్‌లైన్ గుంతలో పడి వృద్ధుడికి గాయాలు

గోల్కొండ: వరద నీటి పైప్‌లైన్‌లు, డ్రైనేజీ పైప్‌లైన్‌లు వేయడానికి తవ్వుతున్న భారీ గుంతలు ప్రమాదఘంటికలు మోగిస్తున్నాయి. గోల్కొండ, టోలిచౌకీ, నానల్‌నగర్ తదితర డివిజన్లలో 18 నెలలకు పైగా పైప్‌లైన్‌ల తవ్వకాల పనులు జరుగుతున్నాయి. టోలిచౌకీ నుంచి టూమ్స్ వెళ్లే రహదారిపై ఆదిత్యానగర్ వద్ద పైప్‌లైన్‌లు వేయడానికి తవ్విన గుంతలో ప్రమాదవశాత్తు ఓ వృద్ధుడు జారిపడ్డాడు. వెంటనే ఆ దారిన వెళ్లే వారు కేకలు వేశారు. అప్రమత్తమైన పైప్‌లైన్ తవ్వకాలు చేసే సిబ్బంది వృద్ధుడిని పైకి లేపారు. రోడ్డుపై నుంచి జేసీబీ వేసి అందులో వృద్ధుడిని కూర్చోబెట్టి పైకి తీశారు.

## చార్మినార్‌లో స్వల్ప అగ్నిప్రమాదం

చార్మినార్: చార్మినార్ రంజాన్ మార్కెట్లో ఆదివారం అర్ధరాత్రి స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. విషయం తెలిసిన వెంటనే మొగల్‌పురా అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించ లేదు. చార్మినార్ ఆయుర్వేద ఆసుపత్రి ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తకు మంటలనుకోవడంతో తద్వారా టీఎస్ఎస్‌పీడీసీ ఎల్‌కు చెందిన కేబుల్ వైర్లు తగులబడటంతో కొద్దిసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. చార్మినార్ డీఈ లింగయ్య వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి విద్యుత్ సరఫరాను నిలిపి వేసి మంటలకు ఆహుతైన కేబుల్ వైర్లను తొలగించిన అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్దరించారు.

**భయంతో వినియోగదారులు, చిరు వ్యాపారుల పరుగులు..**

చార్మినార్‌లో రంజాన్ మార్కెట్ కొనసాగుతుండగా ఆదివారం రాత్రి ఉన్నటుండి ఆయుర్వేద ఆస్పత్రి పక్క నుంచి మంటలు చెలరేయడంతో చిరు వ్యాపారులతో పాటు వినియోగదారులు భయంతో పరుగులు తీశారు. చెత్త కుప్పలకు మంటలు అంటుకున్నాయనే విషయం తెలుసుకొని అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉమర్ అలీషా

గన్‌ఫౌండ్రీ: శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక ఆశ్రమం ఉమర్ అలీ రూరల్ డెవలప్ మెంట్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషల్ హాస్పిటల్ సహకారంతో సోమవారం బషీర్‌బాగ్, ఆదర్శ్‌నగర్ ప్రాంతాల్లో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా మాట్లాడుతూ..తమ సంస్థ ఆధ్వర్యంలో నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా వైద్య శిబిరాలను నిర్వహించతలపెట్టినట్లు తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఈ క్యాంపులు నిర్వహిస్తామని ఉచిత మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దాదాపు 250 మంది ఈ వైద్య శిబిరంలో హాజరైనట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామ్‌గోపాల్ వర్మ, డీఎస్ఎస్ రాజు, రామరాజు పాల్గొన్నారు.

## 'అందరి సహకారంతో విజయం సాధిస్తా'


నాయకులతో సమావేశమైన మాధవీలత

యాకుత్‌పురా: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు, ప్రజల సహకారంతో భారీ మెజార్టీతో విజయం సాధిస్తానాన్ని బీజేపీ హైదరాబాద్ లోక్ సభ నియోజకవర్గం ఎంపీ అభ్యర్థి మాధవీలత ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆమె యాకుత్‌పురా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోని పార్టీ ముఖ్య నాయకులను వారి నివాసల్లో కలిశారు. పార్లమెంట్ ఎన్నికలో పార్టీ విజయానికి పూర్తి సహకరం అందించాలని కోరారు. ఆమె మాట్లాడుతూ..పార్టీ తనకు టికెట్ ప్రకటించినప్పటి నుంచి ప్రతి నాయకుడు, కార్యకర్తలతో సమావేశమై విజయం సాధించేందుకు ముందుకెళ్తున్నామన్నారు. బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ కామాటీ మహేశ్వర్, బీజేపీ యాకుత్‌పురా నియోజకవర్గం కన్వీనర్ గొలికార్ ధీరాజ్‌లాల్, భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్మోహన్, యాకుత్‌పురా బీజేవైఎం కన్వీనర్ ఆర్. ఈశ్వర్ యాదవ్ పాల్గొన్నారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు


పూజల్లో వివిధ పార్టీల నాయకులు

గోల్కొండ: తాళ్లగడ్డ మల్లన్న ఆలయంలోని మల్లన్న భ్రమరాంబ గొల్లకేతమ్మ, నందీశ్వర దేవతా మూర్తుల ద్వాదశ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. వేదపండితులు వై.అవధూతశర్మ, వై.హరహరశర్మ, ఆలయ అర్చకుడు జె.చంద్రశేఖర్‌చారి వేద మంత్రోశ్చరణాల మధ్య ఈ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆదివారం ఉదయం 10.45 గంటలకు పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయ ప్రాంగణం నుంచి మార్కండేయనగర్, తాళ్లగడ్డ, భగవాన్‌దాస్ బాగ్, అన్నపూర్ణ ఆలయం నుంచి తిరిగి స్వామి వారి సన్నిధానం వరకు పల్లకీ ఊరేగింపు జరిగింది. శ్రీ మల్లన్న దేవాలయం తాళ్లగడ్డ యూత్ అసోసియేషన్ కార్వాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం


సువర్ణకర్ అమరేశ్వరీ

అబిడ్స్: మహిళ అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..మంగళ్‌హాట్ రూపా బిల్డింగ్‌లో నివసించే సువర్ణకర్ అమరేశ్వరీ (48) సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ మహేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు


బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: రంజాన్ సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ తెలిపారు. సోమవారం ఆయన యాకుత్‌పురా రైల్వే స్టేషన్, రెయిన్‌బజార్, ఎస్ఆర్‌టీ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రంజాన్ నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## బార్కాస్‌లో ఇఫ్తార్ విందు



చాంద్రాయణగుట్ట: బీఆర్ఎస్ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం సీనియర్ నాయకురాలు చెన్నయ్యగారి సరిత ఆధ్వర్యంలో బార్కాస్ డివిజన్‌లో సోమవారం రాత్రి ఇఫ్తార్ విందు కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మహిళలకు పండ్లు, ఫలాలు తినిపించి ఉపవాస దీక్షలను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరీఫా, ఉస్మాన్, హబీబ్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం


సాన్వీకి షీల్డ్‌ను అందజేస్తున్న ముప్పాల వేణు

గన్‌ఫౌండ్రీ: క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహద పడుతాయని మ్యాచ్ పాయింట్ బాడ్మింటన్ అకాడమీ చైర్మన్ ముప్పాల వేణు అన్నారు. తమిళనాడు ఓపెన్ స్టేట్ సబ్ జూనియర్ బాడ్మింటన్ టోర్నమెంట్ అండర్-9 బాలికల విభాగంలో రాణించిన సాన్వీ లట్టాలను సోమవారం ఇండోర్ స్టేడియంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చిన్న వయస్సులో అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించడం ఎంతో ఆనందంగా ఉందని రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. అండర్-11 విభాగంలో సైతం పోరాడి సెమీ ఫైనల్‌కు చేరుకోవడం అభినందనీయమన్నారు. తమ అకాడమి ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నుంచి సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు కృషి


మాడిశెట్టి సదానందం గుప్తా, ఇతర నాయకులను సత్కరించిన నిర్వాహకులు

అబిడ్స్: ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు కృషి చేస్తామని శ్రీ మహా శివరాత్రి జాగరణ సేవా సమితి అధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తా పేర్కొన్నారు. సేవా సమితి నిర్వాహకులను పెద్ద ఎత్తున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సదానందం గుప్తా మాట్లాడుతూ..తమ సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతిక, సాంప్రదాయాలను చాటడంతో పాటు హిందూ సంస్కృతి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

## కంచన్‌బాగ్‌లో ఫ్లాగ్‌మార్చ్

సంతోష్‌నగర్: పార్లమెంటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి సూచించారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సోమవారం కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి పలు ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ..ప్రజలకు ఎన్నికల సందర్భంగా భరోసా కల్పించేందుకు తాము ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా ఓటు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు లింగరాజు, హేమా తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని అప్పుడే రాణించగలుగుతారని ప్రముఖ విద్యావేత్త నాగేంద్ర ప్రతాప్ అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో సీఎస్‌ఏపీఎస్ సంస్థ మొదటి వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత సమాజంలో అనేక మంది పరీక్షలంటే ఒత్తిడికి లోనవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షా సమయంలో ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా ఉండాలని సూచించారు. విద్యార్థులకు సరైన దిశ, దశ కల్పించేలా సంస్థ చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. అనంతరం సంస్థ నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ సంస్థల హైదరాబాద్ జీఎం గోపాల్‌రెడ్డి, జీటెక్ సంస్థ ఉపాధ్యక్షుడు రవి పింగలి తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై దాడి: ముగ్గురి రిమాండ్

అబిడ్స్: ఒక వర్గానికి చెందిన యువకుడు తన బంధువు, ఆమె స్నేహితురాలిని తీసుకుని తన బైక్‌పై ఎక్కించుకునివెళ్తుండగా మరో వర్గానికి చెందిన వ్యక్తులు వారిని అడ్డగించి అతడిపై దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అబిడ్స్ ఏసీపీ ఎ.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 25న కూకట్‌పల్లికి చెందిన బి.సునీల్ తన బైక్‌పై తన బంధువు వరలక్ష్మి, ఆమె స్నేహితురాలిని ఎక్కించుకుని చార్మినార్ నుంచి నాంపల్లి గృహకల్ప బిల్డింగ్ వరకు వచ్చారు. వారిని వెంబడిస్తున్న ఐదుగురు యువకులు రెండు వాహనాలపై గృహకల్ప ముందు సునీల్ వాహనాన్ని అడ్డగించారు. తమ మతానికి చెందిన ఆమెను ఎందుకు ఎక్కించుకొని వెళ్తున్నావంటూ దాడికి పాల్పడ్డారు. తన ఇష్టంతోనే వెళ్తున్నానని, వరలక్ష్మి తన స్నేహితురాలు అని చెప్పినా సదరు వ్యక్తిపై దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రాజ్‌గోపాల్‌రెడ్డి, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహా, ఎస్‌ఐలు గౌరేందర్ గౌడ్, సుధాకర్ దాడిచేసిన వారి కోసం గాలించి సోమవారం దాడికి పాల్పడిన కుత్బుల్లాపూర్ గాజులరామంకు చెందిన మహ్మద్ అర్బాజ్, సయ్యద్ ఇమ్రాన్, మహ్మద్ అసీముద్దీన్‌ను రిమాండ్‌కు తరలించారు. మిగితా వారి కోసం గాలిస్తున్నట్లు క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహా తెలిపారు.